సాక్షి
విజయనగరం

మంగళవారం । 5 । ఆగస్టు । 2025



క్రీడాకారులతో ఆటలు..!

జిల్లా జట్ల ఎంపికలో సెలక్షన్ కమిటీ సభ్యుడి ఒంటెత్తు పోకడలతో జిల్లా క్రీడాకారులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. - 8లో



అర్జీలు రీ ఓపెన్ కాకుండా పరిష్కారం చూపాలి - 8లో

పీజీఆర్ఎస్‌కు ప్రజల నుంచి వచ్చిన అర్జీలు రీ ఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు.



మీరిచ్చిన హామీలు గుర్తు చేయడం తప్పా..? - 8లో

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయకుండా మోసపూరిత పాలన సాగిస్తోందని పీడిక రాజన్నదొర విమర్శించారు.

న్యూస్‌రీల్

ధరల పట్టిక పెట్టాల్సిందే..

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్స్, క్లినిక్స్, ల్యాబ్స్, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులందరూ తప్పనిసరిగా వివిధ సేవల ధరల పట్టికను పెట్టాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.జీవనరాణి ఆదేశించారు. స్కాన్ సెంటర్ల నిర్వాహకులు పీసీపీఎన్‌డీటీ చట్టం-1994ను అనుసరించి ఐఈసీ బోర్డులను ఏర్పాటుచేయాలన్నారు. లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమనే బోర్డులను తెలుగు, ఇంగ్లిష్‌లో అమర్చాలన్నారు. ప్రతీ ఆస్పత్రికి ఫైర్ ఎన్‌ఓసీ తప్పనిసరన్నారు.

స్పందించిన యంత్రాంగం

- బాలిక కుటుంబంతో మాట్లాడిన ఎంపీడీఓ
- విశ్వనాథపురంలో పారిశుధ్య పనులు



మృతి చెందిన బాలిక కుటుంబంతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేష్

సాక్షి ఎఫెక్ట్...

చీపురుపల్లి: మండలంలోని విశ్వనాథపురంలో ఐదేళ్ల చిన్నారి జ్వరంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఇదే విషయమై 'విజృంభిస్తున్న విషజ్వరాలు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు జిల్లా యంత్రాంగం స్పందించింది. ఎంపీడీఓ ఐ.సురేష్ గ్రామాన్ని సందర్శించారు. బాలిక కుటుంబాన్ని పరామర్శించారు. బాలిక మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మృతి చెందిన బాలికకు ఆస్తమా, ఇస్నోఫీలియా, రక్తహీనత వంటి సమస్యలను వైద్యులు గుర్తించారన్నారు. గ్రామంలో రక్షిత మంచినీటి పథకాలను క్లోరినేషన్ చేయిస్తున్నట్లు చెప్పారు.

కీచక గురువుకు దేహశుద్ధి

- అదుపులోకి తీసుకున్న పోలీసులు

భోగాపురం: భోగాపురం మండలంలోని ఓ గ్రామంలోని ట్యూషన్ సెంటర్‌లో టీచర్‌గా పనిచేస్తున్న వ్యక్తి ఓ బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై ఎస్‌ఐ పాపారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుడివాడ గ్రామంలో విజయనగరం పట్టణానికి చెందిన బూర్లె విజయ్‌కుమార్ అనే వ్యక్తి మరో మహిళతో కలిసి కొంత కాలంగా ట్యూషన్ సెంటర్ నడుపుతున్నాడు. శనివారం సాయంత్రం ట్యూషన్ సెంటర్‌కు వచ్చిన ఓ చిన్నారి పట్ల పైశాచికంగా ప్రవర్తించాడు. ఆ చిన్నారి తల్లిదండ్రులకు చెప్పింది. మరుసటి రోజు ఆదివారం సెలవు కావడంతో.. సోమవారం సాయంత్రం ట్యూషన్ సెంటర్‌కు వచ్చిన విజయ్‌కుమార్‌ను గ్రామస్తులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి వెళ్లి కీచక గురువును అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ పాపారావు తెలిపారు.



మాతాశిశుమరణాల నివారణకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

విజయనగరం ఫోర్ట్: మాతాశిశు మారణాల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ కోరారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సోమవారం మాతా, శిశు మరణాల నివారణపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రసవం చేయడంలో ఇబ్బందులు ఎదురైతే రిఫరల్ ఆస్పత్రికి రిఫర్ చేయాలన్నారు. మహిళలు గర్భం దాల్చిన నుంచి ప్రసవం వరకు అన్ని జాగ్రత్తలు తీసుకొనేలా చూడాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ ఎస్.జీవనరాణి, డీసీహెచ్‌ఎస్ పద్మశ్రీ రాణి, ఘోష ఆస్పత్రి గైనకాలజీ హెచ్‌ఓడీ అరుణ శుభశ్రీ, డీఐఓ ఆర్.అచ్చుతకుమారి, ఐసీడీఎస్ పీడీ విమలారాణి, తదితరులు పాల్గొన్నారు.

రాజాం యువకుల కబడ్డీ కూత

చందక మురళి, ఇ.సుమంత్

రాజాం సిటీ: విజయవాడలో ఈ నెల 15 నుంచి 25 వరకు జరగనున్న ఆంధ్రా ప్రీమియర్ లీగ్ కబడ్డీ పోటీలకు రాజాం పట్టణంలోని బొబ్బిలి జంక్షన్‌కు చెందిన చందక మురళి, బుచ్చెంపేటకు చెందిన ఇద్దుబోయిన సుమంత్‌లు ఎంపికయ్యారు. వీరిని చీపురుపల్లికి చెందిన కోచ్ పాలూరి చైతన్య, క్రీడాకారులు అభినందించారు.



విజయనగరం అర్బన్ ఐసీడీఎస్ కార్యాలయం వద్ద 2జీ ఫోన్లు మాకొద్దంటూ ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



ఆఫీస్ రూంలో ఓ మూలన పడేసిన సెల్‌ఫోన్ల మూట



సెల్ ఫోన్లు పనిచేయడం లేదంటూ బొబ్బిలి సీడీపీఓ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల ఆందోళన

- 2జీ ఫోన్లతో పనిచేయలేక పోతున్నాం
- ఆందోళన చేసిన అంగన్‌వాడీ సిబ్బంది
- సెల్‌ఫోన్‌లను మూటకట్టి అధికారులకు ఇచ్చేసిన వైనం

మీ యాప్‌లకో దండం..

విజయనగరం ఫోర్ట్/బొబ్బిలి: అంగన్‌వాడీలకు ఇచ్చిన 2జీ ఫోన్లతో పనిచేయలేకపోతున్నాం.. తక్కువ స్పీడ్ ఉన్న ఫోన్‌లతో మేము యాప్‌లను రన్‌చేయలేం.. మీ యాప్‌లకో దండం.. తక్కువ వేతనాలతో ఎక్కువ పనులు చేయాలంటే ఎలా? అంటూ అంగన్‌వాడీ సిబ్బంది సోమవారం ఆందోళన చేశారు. విజయనగరం అర్బన్‌లోని ఐసీడీఎస్ కార్యాలయం, బొబ్బిలి సీడీపీఓ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. 2 జీ ఫోన్లతో పనిచేయడం మావల్ల కాదన్నారు. పని ఒత్తిడికి గురవుతున్నామని, యాప్‌లలో ఏది అప్‌లోడ్ చేసినా సకాలంలో కావడంలేదని వాపోయారు. మానసిక ఒత్తిడితో అనారోగ్యానికి గురవుతున్నామన్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో బొబ్బిలిలోని అంగన్‌వాడీ సిబ్బంది సెల్ ఫోన్లను మూటగట్టి సీడీపీఓ కార్యాలయంలో ఓ మూలన పడేశారు. ఈ సెల్‌ఫోన్లు, యాప్‌లతో పనిచేసేదే లేదని కుండబద్దలు కొట్టారు. మా సమస్యలు పరిష్కరించే వరకూ సెల్ ఫోన్లతో పనిచేయబోమని తేల్చిచెప్పారు. కార్యక్రమాల్లో అంగన్‌వాడీ హెల్పర్స్, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పైడిరాజు, లక్ష్మి, సన్యాసమ్మ, రాజరాజేశ్వరి, బొబ్బిలి ప్రాజెక్టు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బి.నిర్మల, జె.కామేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలో వ్యవసాయం



జిల్లాలో ఎరువుల కొరతను తీర్చాలంటూ కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, మాజీ ఎంపీ బెల్లాన, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స, తదితరులు

- రైతు సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం కినుక
- ఎరువుల కోసం రైతన్నకు తప్పని అగచాట్లు
- ఎరువు కొరత నివారించాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు
- రైతాంగం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతి
- పాల్గొన్న మాజీ డిప్యూటీ స్పీకర్, మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ

విజయనగరం:

ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవసాయ రంగం సంక్షోభంలో కొట్టిమిట్టాడుతోందని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. పూర్తిగా వ్యవసాయాధారిత ప్రాంతమైన విజయనగరం జిల్లాలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎరువు అందక రైతులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

దీనంగా మారిన రైతుల పరిస్థితి

జిల్లాలో రైతాంగం పరిస్థితి దీనంగా మారిందని జెడ్పీ చైర్మన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఓ వైపు వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నా ఖరీఫ్ సాగుకు సన్నద్ధమైన రైతాంగానికి అవసరమైన ఎరువులు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. ప్రైవేటు మార్కెట్‌లో అదనంగా డబ్బులు వెచ్చించి ఎరువులుకొనుగోలే చేసే పరిస్థితి దాపురించిందన్నారు. పలువురు డీలర్లు యూరియా కావాలంటే రైతుకు అవసరం లేని ఇతర మందులను కట్టబెట్టి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. డీ-పట్టా రైతులకు యూరియా ఇవ్వమని చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రైతులకు అవసరమైన ఎరువులు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

> రాష్ట్రంలో, జిల్లాలో వ్యవసాయ రంగంలో 2014-19 నాటి పరిస్థితులు పునరావృతమయ్యాయి. ఓ వైపు వర్షాభావ పరిస్థితులతో సతమతమవుతున్న రైతాంగాన్ని ఆదుకునే వారు కరువయ్యారు. రైతులకు అవసరమైన ఎరువులు దొరకడం లేదు. అధిక మొత్తంలో డబ్బులు చెల్లించి బ్లాక్ మార్కెట్‌లో ఎరువులను కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది.
>
> – కోలగట్ల వీరభద్రస్వామి, ఏపీ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్, విజయనగరం

2014-19 నాటి పరిస్థితులు పునరావృతం

> చంద్రబాబు రైతు వ్యతిరేకని మరోసారి నిరూపించుకున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా రైతులు కష్టాలు పట్టించుకోవడం లేదు. అన్నదాత సుఖీభవ పేరిట రూ.20 వేలు ఆర్థిక సాయం అందిస్తామని చెప్పి రూ.5 వేలు, మరి కొందరికి రూ.2 వేలు మాత్రమే జమ చేశారు. జిల్లా వ్యాప్తంగా యూరియా లేక రైతులు అవస్థలు పడుతున్నారు. డీ-పట్టా భూములు సాగుచేసే వారికి యూరియా ఇవ్వరని చెబుతున్నారు. వారు రైతులు కాదా?. రైతులందరికీ రాయితీపై ఎరువులు అందించాలి.
>
> – బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎంపీ

డీ పట్టా భూములు సాగు చేసేవారు రైతులు కాదా?

రైతులకు అన్ని విధాలుగా మోసం...

ఎన్నికలకు ముందు మోసకారి మాటలు చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రైతాంగానికి తీరని అన్యాయం చేస్తోందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు విమర్శించారు. రైతులకు పెట్టుబడి సహాయం కింద సంవత్సరానికి రూ.20వేలు ఇస్తామని, జూన్ 2024 నుంచే దీన్ని అమలు చేస్తామని ప్రకటించి మాట తప్పిందన్నారు. రెండు సంవత్సరాలకు ప్రతి రైతుకు రూ.40వేలు ఇవ్వాల్సి ఉండగా, కేవలం రూ.5వేలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుందని దుమెత్తిపోశారు. మిగిలిన మొత్తం ఎప్పుడు చెల్లిస్తారన్న విషయాన్ని చెప్పలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 7 లక్షల మందిని పథకానికి దూరం చేశారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి విజయనగరం జిల్లాలో 2.60 లక్షల మందికి సహాయం అందిస్తే, ప్రస్తుత ప్రభుత్వంలో 2.25 లక్షల మందికే అరకొర సాయం చేశారన్నారు. ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తేసి పంట బీమా ప్రీమియంను రైతులు కట్టుకోవాలని చెబుతుండడం విచారకరమన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు, కొనుగోలుచేసేవారు లేక రోడ్డుమీద వేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన ధరల స్థిరీకరణ నిధిని ఎత్తివేసి, రైతులను కష్టాల పాలు చేశారన్నారు.



కూటమి ప్రభుత్వ తీరును మీడియా సాక్షిగా ఎండగడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

వర్షాభావ పరిస్థితులపై సమీక్షలు ఎక్కడ?

ప్రస్తుత ఖరీఫ్ సీజనలో జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులతో రైతులు ఆందోళన చెందుతున్నా ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగంలో కనీసం చలనం లేదని జెడ్పీ చైర్మన్ విమర్శించారు. ప్రాజెక్టుల నుంచి నీరు విడిచిపెట్టినట్లు ఫొటోలకు ఫోజులిచ్చిన నాయకులు సాగునీరు అందుతుందా లేదా అన్న అంశంపై కనీసం సమీక్షలు నిర్వహించకపోవడం దారుణమన్నారు. తోటపల్లి నుంచి 40 రోజుల కిందట నీరువిడిచిపెట్టినా ఇప్పటికీ శివారు ఆయకట్టుకు చేరలేదన్నారు. గడిగెడ్డ రిజర్వాయర్‌లో నీరులేక ఆ ప్రాంత రైతులు సాగుకు దూరమయ్యారన్నారు. తాటిపూడి నుంచి సకాలంలో నీరు సరఫరా కాలేదన్నారు. వీటికి అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయలోపమే కారణమని చెప్పారు. రైతులకు నిరంతరాయంగా 9 గంటల విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తప్పడం లేదన్నారు. ఖాళీ భూములను కార్పొరేటర్ సంస్థలకు అప్పగించడమే ప్రభుత్వ ప్రాధాన్యతగా కనిపిస్తోందన్నారు. బాధ్యతగల ప్రతి పక్షంగా రైతులకు జరుగుతున్న అన్యాయంపై పోరాడి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని, వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ రైతుల పక్షాన నిలబడుతుందన్నారు.

కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు వర్రి నర్సింహమూర్తి, సంగంరెడ్డి బంగారునాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టి వీరవెంకటరాజేష్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నెక్కల నాయుబాబు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు జనార్దన్, ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, జెడ్పీటీసీలు గెదల సన్యాసినాయుడు, వి.శ్రీనివాసరావు, సీర అప్పలనాయుడు, గార తవుడు, ఎంపీపీలు మామిడి అప్పలనాయుడు, దగ్గు సత్యంనాయుడు, పతివాడ అప్పలనాయుడు, పార్టీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, పార్టీనాయకులు ఉప్పాడ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ల నుంచి పక్కదారి పడుతున్న యూరియా...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో ఎక్కడా ఎరువులకొరత లేకుండా చర్యలు చేపట్టాం. రైతు భరోసా కేంద్రాల ద్వారా అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించాం. జూలై నెలలో 1.30 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు కేంద్రం నుంచి రావాల్సి ఉండగా.. సగం మాత్రమే వచ్చింది. పీఏసీఎస్‌లకు కొత్తగా నియామకమైన పాలకవర్గాలు 100 నుంచి 200 బస్తాల వరకు అక్రమంగా తరలిస్తూ బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుంటే రైతులకు ఎలా మేలు చేస్తారని కూటమి నేతలను జెడ్పీ చైర్మన్ ప్రశ్నించారు. పీఏసీఎస్‌లు రైతులకు సేవ చేయాలే తప్ప వ్యాపార సంస్థలుగా మారడం దారుణమన్నారు.

చీపురుపల్లికి పాకిన రెడ్‌బుక్ రాజ్యాంగం

- పశువుల పాక తొలగింపు విషయంలో వివాదం
- వైఎస్సార్‌సీపీ మద్దతుదారులపై టీడీపీ వర్గీయుల దాడి
- వృద్ధురాలి తలపై తీవ్ర గాయాలు
- ఎనిమిది కుట్లు పడినా ఆస్పత్రిలో బెడ్ ఇవ్వని వైనం
- ఆస్పత్రి మెట్ల మీద దీనావస్థలో వృద్ధురాలు
- ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన వారిపై పోలీసుల వీరంగం!



బెడ్ ఇవ్వకపోవడంతో ఏరియా ఆస్పత్రి మెట్లపై గాయాలపాలైన వృద్ధురాలు నారాయణమ్మ



పోలీసుల దాడిలో గాయపడ్డానని చూపిస్తున్న ఎర్ర భాస్కరరావు

చీపురుపల్లి:

రెడ్‌బుక్ రాజ్యాంగ ప్రభావం చీపురుపల్లికి పాకింది. టీడీపీ వర్గీయులు దాడి చేస్తుంటే గాయాలపాలై న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వైఎస్సార్‌సీపీ వర్గీయులకు అక్కడ కూడా బాధలు తప్పడం లేదు. గోడ దెబ్బతో పాటు చెంప దెబ్బ అన్నట్లు ఫిర్యాదు చేసేందుకు వెళితే అధికార పార్టీ నేతల ఒత్తిళ్ల మేరకు వైఎస్సార్‌సీపీ వర్గీయులపై పోలీసులు విరుచుకుపడుతున్నారు. ఇందుకు మండలంలోని గుణిదాం గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన సంఘటనే నిలువెత్తు సాక్ష్యం. టీడీపీ వర్గీయుల చేతిలో గాయాలపాలై పోలీస్‌స్టేషన్‌కు వస్తే అక్కడ కూడా పోలీసులతో మళ్లీ దెబ్బలు తినాల్సి వచ్చిందని ఎర్ర భాస్కరరావుతో పాటు పలు వురు బాధితులు లబోదిబోమన్నారు. చివరికి వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కార్యకర్తకు మద్దతుగా నిలవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పోలీసులు కేసు నమోదు చేసినట్లు బాధితులు తెలిపారు. ఇదిలా ఉండగా టీడీపీ వర్గీయుల దాడిలో తలపై తీవ్ర గాయంతో ఏరియా ఆస్పత్రికి వచ్చిన ఎర్ర నారాయణమ్మ అనే వృద్ధురాలికి సిబ్బంది ఎనిమిది కుట్లు వేసి కట్టు కట్టారు. కానీ ఆమెకు బెడ్ ఇవ్వకపోవడంతో ఏరియా ఆస్పత్రి మెట్లపై దీనంగా కూర్చోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

కేసుల నమోదు....

ఎస్సై ఎల్.దామోదరరావు మాట్లాడుతూ.. గుణిదాం గ్రామంలో పశువుల పాక వివాదంలో ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎర్రా సావిత్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొలగాన రామారావు, ఎర్ర భాస్కరరావు, ఎర్ర సూర్యనారాయణలపైన, అలాగే ఎర్ర నారాయణమ్మ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం ఎర్ర సావిత్రమ్మ, ఎర్ర సురేష్, ఎర్ర రాంబాబులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

అసలేం జరిగిందంటే..

ఈ సంఘటనకు సంబంధించి బాధితులు ఎర్ర నారాయణమ్మ, భాస్కరరావు అందించిన వివరాల్లోకి వెళితే.. గుణిదాం గ్రామంలో ఎర్ర నారాయణమ్మ తన పిల్లలతో కలిసి ఇల్లు నిర్మించుకుని చాలా కాలంగా జీవనం సాగిస్తోంది. ఆ ఇంటి పక్కనే పశువుల పాక ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఆ పశువుల పాక తమదేనంటూ అదే గ్రామానికి చెందిన ఎర్ర సావిత్రమ్మ కుటుంబం (టీడీపీ మద్దతుదారులు) పట్టుబడుతోంది. దీంతో ఈ వ్యవహారంపై నారాయణమ్మ కోర్టును కూడా ఆశ్రయించారు. ఇదిలా ఉంటే ఎర్ర సావిత్రమ్మ, ఎర్ర సురేష్, రాంబాబు సోమవారం రాత్రి జేసీబీని తీసుకువచ్చి పశువుల పాకను తొలగించేందుకు సిద్ధపడ్డారు. దీంతో నారాయణమ్మ, భాస్కరరావు, తదితరులు అడ్డుకోగా.. నారాయణమ్మపై టీడీపీ వర్గీయులు దాడి చేశారు. కొట్లాటలో నారాయణమ్మ తలకు తీవ్ర గాయమైంది.

సబ్ కలెక్టర్లుగా స్వప్నిల్ జగన్నాథ్, వైశాలి

సాక్షి, పార్వతీపురం మన్యం: పార్వతీపురం, పాలకొండ డివిజన్లకు 2023 బ్యాచ్‌కు చెందిన ప్రొబేషనరీ ఐఏఎస్‌లను సబ్ కలెక్టర్లుగా నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాత్సవను బదిలీ చేసింది. ఆ స్థానంలో ఆర్.వైశాలి నియమితులయ్యారు. పాలకొండ సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డిని బదిలీ చేస్తూ.. ఆ స్థానంలో పవర్ స్వప్నిల్ జగన్నాథ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

సమస్యల పరిష్కారానికి డిమాండ్



సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న యూనియన్ నాయకులు, పంచాయతీ కార్మికులు

విజయనగరం గంటస్తంభం: మేజర్ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి డిమాండ్ చేశారు. కార్మికులతో కలిసి కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేశారు. కార్మికులకు అవసరమైన రక్షణ పరికరాల సరఫరాతో పాటు కనీసం వేతనం నెలకు రూ.26వేలు చెల్లించాలని, 10వ తేదీలోపు జీతాలు చెల్లించాలని, కార్మికులు మరణిస్తే వారి కుటుంబాలకు రూ.15 వేలు మట్టి ఖర్చులు, ఎక్స్‌గ్రేషియోగా రూ.5లక్షలు, వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఆర్వో శ్రీనివాసరాజుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ యూనియన్ నాయకులు కోటేశ్వరరావు, జనార్దన్, భవానీ, శ్యామల, వెంకట్, భాస్కర్ రావు, పైడిరాజు, సంతోష్, రాంబాబు, కృష్ణ, అప్పన్న బాబు, రమణ, నాగ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏకలవ్య పాఠశాలను సందర్శించిన నోడల్ అధికారి



ఏకలవ్య పాఠశాలలో భోజన నాణ్యత పరిశీలిస్తున్న నోడల్ అధికారి సూర్యనారాయణ

మక్కువ: మండలంలోని అనసభద్ర గ్రామం సమీపంలోని ఏకలవ్య పాఠశాలను నోడల్ అధికారి, డిప్యూటీ ఎంపీడీవో ఎస్.సూర్యనారాయణ సోమవారం సందర్శించారు. పాఠశాలలోని విద్యార్థులు తరగతి గదులను, విద్యార్థులు హాజరు, భోజనమెనూ, పాఠశాల పరిశుభ్రతను పరిశీలించారు. అలాగే మరుగుదొడ్లు అసంతృప్తికరంగా ఉన్నట్లు గుర్తించారు. పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించాల్సి ఉందన్నారు. ఆర్వో తాగునీరు అవసరమని, పాఠశాల ఆవరణ చదును చేయాల్సి ఉందని, ఇన్వర్టర్లు, జనరేటర్ అవసరమున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో సూర్యనారాయణ గుర్తించారు. పై సమస్యలను ఉన్నతాధికారులకు నివేదిస్తానని ఆయన తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు పార్వతీపురం యోగా సాధకులు



ప్రశంసాపత్రాలను చూపిస్తున్న యోగా క్రీడాకారులు

పార్వతీపురం రూరల్: జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి యోగా పోటీలు ముగిశాయి. ఈ మేరకు పది నుంచి ఏభై ఏళ్ల వయస్సు గల క్రీడాకారులు ప్రతిభ చూపించారు. ఈ సందర్భంగా వారికి సోమవరం ప్రశంసాపత్రాలు, పతాకాలు అందించారు. ఈ సందర్భంగా పోటీల పరిశీలకుడు భాస్కరరావు మాట్లాడుతూ గెలుపొందిన విజేతలకు ఈ నెల 21నుంచి 24 వరకు తాడేపల్లె గూడెంలో రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయన్నారు.

గంజాయి నిందితుడి అరెస్టు



పట్టుబడిన నిందితుడితో ఎస్.కోట సీఐ నారాయణమూర్తి

శృంగవరపుకోట: గంజాయి రవాణా చేస్తున్న నిందితుడిని కేరళ రాష్ట్రంలో పట్టుకుని కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్.కోట సీఐ వి.నారాయణమూర్తి చెప్పారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ గత ఏడాది డిసెంబర్‌లో కేరళ రాష్ట్రానికి చెందిన బొలెరో వాహనంలో ఇద్దరు వ్యక్తులు 117కిలోల గంజాయితో పట్టుబడ్డారన్నారు. ఈ కేసులో కేరళ నుంచి వాహనాన్ని పంపి గంజాయి తెమ్మని చెప్పిన కేరళ రాష్ట్రం, త్రిశూర్ జిల్లా కట్టూర్ పట్టణానికి చెందిన శ్రీజిత్‌ను కేరళ పోలీసుల సహకారంతో పట్టుకుని అరెస్టు చేసి అక్కడి కోర్టులో ప్రవేశపెట్టి, కోర్టు ఆదేశాల మేరకు ఎస్.కోట తీసుకువచ్చి కోర్టులో ప్రవేశపెట్టినట్లు చెప్పారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు సెంట్రల్ జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు. గంజాయి అక్రమ రవాణా కేసుల్లో కేవలం పట్టుబడిన నిందితులపైనే కాకుండా, ప్రోత్సహిస్తున్న మూలాలను వెదికి పట్టుకుని కేసులు పెడుతున్నామన్నారు.

మృతుడి ఆచూకీ లభ్యం

వేపాడ: మండలంలోని నీలకంఠరాజపురం గ్రామంలో రైవాడ కల్వర్టు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందిన వ్యక్తి ఆచూకీ తెలిసినట్లు వల్లంపూడి ఎస్సై సుదర్శన్ తెలిపారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శనివారం అర్ధరాత్రి రైవాడ కాలువ కల్వర్టువద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన విషయం విదితమే. ఈ సంఘటనపై పలు పత్రికల్లో వచ్చిన వార్తలతో కుటుంబసభ్యులు గుర్తించి వల్లంపూడి స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అనకాపల్లి జిల్లా చోడవరం మండలం గజపతినగరానికి చెందిన పీలా శివశంకర్ (41) ప్రమాదంలో మృతిచెందినట్లు చెప్పారు. సమాచారం తెలుసుకున్న శివశంకర్ భార్య పార్వతి స్టేషన్‌కు వచ్చినట్లు తెలిపారు. మృతిచెందిన శివశంకర్ విశాఖలోని మధురవాడలో ఆయుష్ డిపార్ట్‌మెంట్‌లో వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని చెప్పారు. రెండోతేదీన ఎస్.కోట వివేకానంద కాలేజీలో ఇంటర్ చదువుతున్న కుమార్తెను చూడడానికి వెళ్లి తిరిగి వస్తుండగా నీలకంఠరాజపురం రైవాడ కల్వర్టు వద్ద ప్రమాదంలో మృతిచెందినట్లు తెలిపారు. మృతుడు శివశంకర్‌కు భార్య పార్వతి ఇద్దరు పిల్లలు ఉన్నారు. పార్వతి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. ఢీ కొన్న గుర్తుతెలియన వాహనంపై బృందాలను ఏర్పాటుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹105	₹180	₹190

క్రీడాకారులతో ఆటలు..!

- జిల్లా క్రికెట్‌లో చక్రం తిప్పుతున్న సెలక్షన్ కమిటీ సభ్యుడు
- పొరుగు జిల్లాలు, రాష్ట్రాల క్రీడాకారులకు పెద్దపీట
- డమ్మీగా మారిన చైర్మన్, కార్యదర్శులు
- అసోసియేషన్ సభ్యులను ఖాతరు చేయని సెలెక్టర్
- జిల్లా క్రీడాకారులకు న్యాయం చేయాలంటూ మంత్రికి మొరపెట్టుకున్న తల్లిదండ్రులు
- నిమ్మకునీరెత్తినట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్



క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

విజయనగరం: జిల్లా క్రికెట్‌లో ఉమ్మడి విజయనగరం జిల్లా క్రీడాకారుల ప్రాతినిధ్యం తగ్గిపోతోంది. జిల్లా జట్ల ఎంపికలో సెలక్షన్ కమిటీ సభ్యుడి ఒంటెత్తు పోకడలతో జిల్లా క్రీడాకారులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. దశాబ్ద కాలంగా ఇదే తరహా వ్యవహారం నడుస్తున్నప్పటికీ, ఏడాది క్రితం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వ పెద్దలు జిల్లా క్రీడాకారులకు న్యాయం చేస్తామంటూ ప్రకటనలు చేశారు. సంబంధిత శాఖాధికారులతో పాటు, అసోసియేషన్ ప్రతినిధులతో స్థానిక ఎమ్మెల్యే సమీక్ష చేశారు.

విజయనగరం కాదు.. విశాఖ 'బి' జట్టు పేరు సార్థకం

విజయనగరం జిల్లా జట్టులో ఒకప్పుడు క్రికెట్ ఆడే క్రీడాకారులు లేక పొరుగు జిల్లాల నుంచి క్రీడాకారులు వచ్చి జిల్లా తరఫున ఆడేవారు. నాటి నుంచి క్రికెట్ వర్గాల్లో విజయనగరం జిల్లా జట్టును విశాఖ బి జట్టుగా పిలిచేవారు. అయితే జిల్లా క్రీడాకారులకు క్రికెట్‌పై అవగాహన పెరగడంతో ఎక్కువ సంఖ్యలో జిల్లా క్రీడాకారులు ఎక్కువమంది క్రికెట్ ను ప్రొఫెషన్‌గా తీసుకున్నారు. దీంతో ఉమ్మడి విజయనగరం జిల్లాలో అధిక సంఖ్యలో క్రీడాకారులు తయారయ్యారు. అయినా గడిచిన మూడు, నాలుగేళ్లుగా విజయనగరం జిల్లా జట్టులో వలస పక్షుల ప్రాతినిధ్యం భారీ స్థాయిలో పెరిగిపోయింది. ప్రతి ఏటా అండర్-12, అండర్-14, అండర్-16, అండర్-19, అండర్-23, సీనియర్స్ విభాగాల్లో ఎంపికలు జరిగితే ప్రతి విభాగంలో సగానికి పైగా పొరుగు జిల్లా క్రీడాకారులకే ప్రాతినిధ్యం కల్పిస్తున్నారు.

అయితే ఏడాది కాలమైనా అదే పరిస్థితి కొనసాగడంపై తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా క్రికెట్‌లో కీలక స్థానంలో ఉన్న కార్యదర్శితో తనకున్న స్నేహాన్ని ఉపయోగించుకుని జట్ల ఎంపికలో తన మాటే చెల్లుబాటయ్యేలా సెలక్షన్ కమిటీ సభ్యుడు వ్యవహారాన్ని నడిపిస్తున్నట్లు తల్లిదండ్రులు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వద్ద ఏకరువు పెట్టినట్లు సమాచారం. ఇప్పటికైనా దేశానికి ప్రాతినిధ్యం వహించిన విజయనగరం క్రికెటర్ సర్ విజ్జీ నడయాడిన జిల్లాలో స్థానిక క్రీడాకారులకే చోటు కల్పించాలని, ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు ఎమ్మెల్యేలు ఎంపీలు కృషి చేయాలని స్థానిక క్రీడాకారులు, క్రీడాభిమానులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

అన్నీ వట్టి మాటలేనా?

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఆరేడు నెలలకు జిల్లా క్రికెట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. చైర్మన్‌గా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కార్యదర్శిగా పి.సీతారామరాజు, ఇతర కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అయితే నూతన కార్యవర్గం ఏర్పడిన సమయంలో సభ్యులు, అసోసియేషన్ పెద్దలు స్థానిక క్రీడాకారులకే ప్రాధాన్యం కల్పిస్తామని చెప్పిన మాటలు వట్టి మాటలు గానే మిగిలిపోయాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2025లో అన్ని విభాగాల జట్ల ఎంపికలో స్థానికేతర క్రీడాకారులకే తగిన ప్రాధాన్యం దక్కినట్లు తల్లిదండ్రులు ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఇటీవల అండర్-16 జట్టుకు ఎంపికైన 18 మంది జిల్లా జట్టు క్రీడాకారుల్లో సుమారు 13 మంది పొరుగు జిల్లాలకు చెందిన క్రీడాకారులే ఉన్నారంటే ఇతర జిల్లాల క్రీడాకారుల హవా ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. అలాగే అండర్ -19, అండర్-23, సీనియర్ విభాగంలోనూ వారి ప్రాతినిధ్యం ఎక్కువగా ఉందని తెలుస్తోంది.

దర్జాగా వస్తారు.. జట్టులో చోటు ఎగరేసుకు పోతారు

పొరుగు జిల్లాల క్రీడాకారులు ఇక్కడ వారి సలహాతోనే జిల్లాలోని వివిధ పాఠశాలలు, కళాశాలలో చేరుతారు. వారందించే స్టడీ సర్టిఫికెట్ ఆధారంగా సదరు సెలెక్టర్ వారిని జట్టుకు ఎంపిక చేస్తారు. అయితే వారు పాఠశాలకు వచ్చింది లేదు..వెళ్లిందీ లేదు. ఎందుకంటే ఇక్కడికి ప్రతిరోజు పాఠశాలకు గాని, కళాశాలకు గానీ వస్తే, జిల్లా కేంద్రంలోని విజ్జీ స్టేడియంలో ప్రతిరోజు నిర్వహించే ప్రాక్టీస్ సెషన్‌కు ఎందుకు రారని స్థానిక క్రీడాకారులు, తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. స్థానికేతర క్రీడాకారుల తల్లిదండ్రులు ఆధార్ ఇతరత్రా సర్టిఫికెట్లు పొరుగు జిల్లాలోనే ఉంటాయి. వీరివి మాత్రం అన్ని సర్టిఫికెట్లు ఇక్కడే ఉన్నట్లు సెలక్షన్ సమయంలో అందిస్తుంటారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

గుర్రుగా అసోసియేషన్ సభ్యులు

జిల్లా సెలక్షన్ కమిటీ సభ్యుల తీరుపై అసోసియేషన్ లోని కొంతమంది సభ్యులు గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది. సెలక్షన్ కమిటీ ఒంటెత్తు పోకడలతో విసుగు చెందిన అసోసియేషన్ సభ్యులు సైతం తల్లిదండ్రులతో పాటు మంత్రి వద్దకు వెళ్లినట్టు విశ్వసనీయ సమాచారం.

నిబంధనలు పాటిస్తున్నాం:

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి జట్టు ఎంపికల్లో నిబంధనల ప్రకారమే నడుచుకుంటున్నాం. మూడేళ్ల పాటు జిల్లా పరిధిలో చదివే వారికి అవకాశం కల్పిస్తున్నాం. క్రీడాకారుడి స్టడీ సర్టిఫికెట్, ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్నాం. వాటి ప్రకారమే ఎంపికలకు అనుమతిస్తున్నాం. ఎంపిక ప్రక్రియలో ఎటువంటి అవినీతికి తావులేకుండా చూస్తున్నాం.

– పి.సీతారామరాజు, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి, విజయనగరం.

అర్జీలు రీ ఓపెన్ కాకుండా పరిష్కారం చూపాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



పీజీఆర్ఎస్‌లో అర్జీదారుల మొరను ఆలకిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్, ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం అర్బన్: పీజీఆర్ఎస్ కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చిన అర్జీలను నిర్ణీత గడువు లోగా పరిష్కరించాలని అర్జీలు రీ ఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమం అమలుపై ఉన్నతాధికారుల ఆదేశాలను అమలు చేయాలని స్పష్టం చేశారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, డిప్యూటీ కలెక్టర్‌లు వెంకటేశ్వర రావు, ప్రమీలా గాంధీ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అర్జీల పరిష్కారంపై కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడుతూ పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో, ఉన్నతాధికారుల ఆదేశాల అమలులో కొంతమంది జిల్లా అధికారులు అలసత్వం వహిస్తున్నారని, అర్జీలపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీల పరిష్కార స్థితిపై రోజువారీ సమీక్ష నిర్వహించుకోవాలని సూచించారు. పీజీఆర్ఎస్‌లో ప్రజలు సామాజిక, వ్యక్తిగత అంశాలపై 198 అర్జీలు అందజేశారు.

ఎస్పీ గ్రీవెన్స్ సెల్‌కు 32 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి వారం నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఎస్పీ వకుల్ జిందల్, ఏఎస్పీసౌమ్యలతలు పాల్గొని 32 ఫిర్యాదులు స్వీకరించారు. వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిర్యాదు దారుల ముందే సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్స్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు వివరించారు. ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవమైనట్లయితే చట్ట పరిధిలో చర్యలుచేపట్టాలని సంబంధిత శాఖ సిబ్బందిని ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐ ఏవీ లీలారావు, డీసీఆర్బీ సీఐ బి.సుధాకర్, ఎస్సై రాజేష్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిమళించిన మానవత్వం



గాయపడిన అనాథ మహిళను ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

రాజాం సిటీ: మానవతా సంస్థ సభ్యుల్లో మానవత్వం పరిమళించింది. రోడ్డు పక్కన గాయాలతో బాధపడుతున్న అనాథ మహిళకు వైద్యసేవలు అందించి మానవత్వం చాటుకున్నారు. స్థానిక బొబ్బిలి రోడ్డులోని ఆర్‌సీఎం చర్చి సమీపంలో అనాథ మహిళను గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఓ మూలన ఉన్న మహిళను స్థానికులు గుర్తించి మానవతా సంస్థ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే సభ్యులు ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్, రెడ్‌క్రాస్ ప్రతినిధి పెంకి చైతన్య, కిరణ్‌లు స్పందించి సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత అనాథ మహిళను ప్రత్యేక వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందించారు. అయితే ఆమె తీవ్రంగా గాయపడడంతో శస్త్రచికిత్స పడుతుందని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామని వైద్యులు తెలిపారని మానవతా సంస్థ సభ్యులు తెలిపారు. దీంతో పలువురు పట్టణవాసులు వారి సేవలను కొనియాడారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

పార్వతీపురం రూరల్: మండలంలోని బందలుప్పి గ్రామానికి చెందిన ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనకాపల్లి ప్రాంతానికి చెందిన ఆమె భర్త, అత్తమామలపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషి కుమారి తెలిపారు. 2022లో వివాహం జరిగిన అనంతరం అదనపు కట్నం కోసం డిమాండ్ చేస్తూ తనను వేధిస్తూ బందలుప్పి గ్రామంలో కన్నవారింట పిల్లలతో విడిచిపెట్టి భర్త వెళ్లిపోయినట్లు ఫిర్యాదులో బాధిత మహిళ పేర్కొన్నట్లు ఎస్సై తెలిపారు.

మీరిచ్చిన హామీలు గుర్తు చేయడం తప్పా..?



మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొరకు స్వాగతం పలుకుతున్న ప్రజలు

- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తుచేయడం తప్పా? మీరిచ్చిన హామీలను గుర్తుచేస్తున్న మాపై తప్పుడు విమర్శలు చేస్తారా? అంటూ మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర మండిపడ్డారు. ఈ మేరకు సాలూరు పట్టణంలోని 2,4,5 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ -మోసం గ్యారంటీ కార్యక్రమంలో రాజన్నదొర పాల్గొన్నారు. ఈ క్రమంలో వార్డుల్లో తిరిగిన ఆయనకు అడుగడుగునా స్థానిక మహిళలు, ప్రజలు హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈ ఏడాది పాలనలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయలేదని వాపోతూ , తమ సమస్యలను ప్రజలు రాజన్నదొర ముందు ఏకరువు పెట్టారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను మీకు ఈ పాంప్లెట్‌ల ద్వారా ఇస్తున్నామని, క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసినా అవి వస్తాయని ప్రజలకు రాజన్నదొర తెలిపారు.

ఆడబిడ్డ నిధి అమలు చేసేదెప్పుడు?

2024 ఎన్నికల్లో సుమారు 2 కోట్ల 10 లక్షల మంది మహిళా ఓటర్లు ఉన్నారని తెలిసిందని అందులో 60 ఏళ్ల పైబడిన వారు సుమారు 60 వేల మందిని తీసేసినా కనీసం కోటి 50 లక్షల మంది మహిళలకు అడబిడ్డ నిధి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. నేడు ఆ హామీని అమలుచేయకుండా ప్రజలను మోసం చేసే పద్ధతి సరైంది కాదన్నారు. టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పక అమలుచేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఏ అన్యాయం జరిగినా, ఏ కష్టమొచ్చినా, ఓ సోదరుడిగా, మీ ఇంటి పెద్ద కొడుకుగా అండగా నేను ఉంటానని రాజన్నదొర పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 5 వ వార్డులో అంబేడ్కర్ విగ్రహానికి రాజన్నదొర పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు గిరిరఘు, సింగారపు ఈశ్వరరావు, గులిపల్లినాగ, నిమ్మకాయల సువర్ణమ్మ, తాడ్డి లక్ష్మి, శంకరరావు, యశోదకృష్ణ, రౌతు చిన్నయ్య, శ్రీను, చిన్నారావు, పిరిడిరామకృష్ణ, మజ్జి అప్పారావు, కాకి పాండురంగారావు, కొల్లి వెంకటరమణ, హరిబాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి శ్రద్ధ తీసుకోవాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం రూరల్: ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి అధికారులు పనిచేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం 138 అర్జీలను కలెక్టర్‌తో పాటు పీఓ అశుతోష్ శ్రీవాత్సవ, డీఆర్ఓ కె. హేమలత కేఆర్‌సీ ఎస్‌డీసీ పి.ధర్మచంద్రారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి స్వీకరించారు. నిర్దేశించిన గడువులోనే పెండింగ్‌లు లేకుండా అర్జీలను పరిష్కరించాలని అధికారుకు ఈ సందర్భంగా కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లాలోని పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేగంగా సమస్యల పరిష్కారం

సమస్యలను వేగంగా పరిష్కరించడమే ప్రధాన ఉద్దేశమని ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలో ఉన్న పలు స్టేషన్ల పరిధిలలో నుంచి వచ్చిన ఫిర్యాదు దారుల నుంచి 13 ఫిర్యాదులు స్వీకరించి, అర్జీదారులతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవాలైనట్లయితే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీఆర్బీ సీఐ సుధాకర్, ఎస్సై ఫకృద్దీన్ తదితర సిబ్బంది ఉన్నారు.

ఐవీఆర్ఎస్ సంతృప్తికరంగా ఉండాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలపై అర్జీదారుల సంతృప్తిస్థాయి పెరగాల్సి ఉందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. సమస్యల పరిష్కార విషయమై ఐవీఆర్ఎస్ ద్వారా ప్రభుత్వం చేసే సర్వేలో శతశాతం సంతృప్తికరంగా ఉన్నట్లు అర్జీదారుల స్పందన ఉండాలని స్పష్టం చేశారు. ఈ మేరకు అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ సర్వేలో శతశాతం సంతృప్తి చెందకపోతే సంబంధిత అధికారులను బాధ్యులుగా చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం పీజీఆర్ఎస్, పీ4, పీఎం సూర్యఘర్, ఈపీటీఎస్ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఐటీడీఏ పీఓలు అశుతోష్‌శ్రీవాత్సవ, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డీఆర్ఓ కె. హేమలత, ఎస్‌డీసీలు పి. ధర్మచంద్రారెడ్డి, ఎస్. దిలీప్ చక్రవర్తి, డీఆర్‌డీఏ పీడీ ఎం. సుధారాణి, డీఈఓ బి. రాజ్‌కుమార్, డీఐఈఓ వై. నాగేశ్వరరావు, సమగ్ర శిక్ష ఏపీసీ ఆర్. తేజేశ్వరరావు, ఈపీడీసీఎల్ ఎస్ఈకె మల్లికార్జునరావు, డీఎంఅండ్‌హెచ్ఓ డా. భాస్కరరావు, డీసీ హెచ్ఓ డా. మన్మథరావు, డీబీసీ డబ్ల్యూఓ అప్పన్న, డీఆర్‌డబ్ల్యూ ఎస్ఈఓ ప్రభాకరరావు, సీడీపీఓ శాంతి భవాని, వివిధ అధికారులు పాల్గొన్నారు.

ఆనకట్టవద్ద గోతిలో పడి వ్యక్తి మృతి



లక్ష్మణరెడ్డి మృతదేహం



లక్ష్మణరెడ్డి (ఫైల్)

జామి: మండలంలో జామి ఆనకట్టవద్ద గోతిలో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆనందపురం మండలం బొడ్డుపాలెం గ్రామానికి చెందిన సాడి లక్ష్మణరెడ్డి(38) తన స్నేహితులతో కలిసి స్నేహితుల దినోత్సవం సందర్భంగా జాగరం గెడ్డనీరు జామి గోస్తనినదిలో కలిసే ప్రాంతం వద్దకు ఆదివారం సాయంత్రం వచ్చి సరదాగా గడిపాడు. ఈ క్రమంలో బహిర్భుమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి ఆనకట్టవద్ద ఉన్న గోతిలో పడిపోయాడు. స్థానికులు, రెస్క్యూ బృందం గాలించగా సోమవారం ఉదయం లక్ష్మణరెడ్డి మృతదేహం లభ్యమైంది. ఈ ఘటనపై మృతుడి భార్య అరుణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో జామి ఎస్సై వీరజనార్దన్ కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

భోగాపురం: మండలంలోని రావాడ గ్రామానికి చెందిన బుగత ఈశ్వరరావు(47) తగరపువలసలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మరణించినట్లు ఎస్సై పాపారావు తెలిపారు. దీనిపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రావాడ గ్రామానికి చెందిన ఈశ్వరరావుకు భార్య గోవిందమ్మతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈమధ్య కాలంలో తల్లికి వందనం ద్వారా భార్య బ్యాంకు ఖతాలో డబ్బులు పడ్డాయి. అందులో నుంచి కొంత డబ్బులు ఇవ్వమని భర్త ఈశ్వరరావు భార్యపై ఒత్తిడి తెచ్చాడు. దీంతో వారిద్దరి మధ్య గొడవ జరగడంతో మనస్తాపం చెందిన ఈశ్వరరావు నెల 2వ తేదీన గ్రామానికి సమీపంలో ఉన్న భాష్యం లేఅవుట్‌లోకి వెళ్లి పురుగు మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే తగరపువలస ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. భార్య గోవిందమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై పాపారావు కేసు నమోదు చేశారు.

తోటపల్లి చివరి ఆయకట్టుకు నీరందించాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ఖరీఫ్ పంట కాలంలో ఆయకట్టు చివరి భూముల వరకు సాగునీరు అందించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో నీటి పారుదల శాఖ, తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్టు అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్టు నుంచి జూలై ఆరవ తేదీన నీరు విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు కింద జిల్లాలోని 12 మండలాల్లో 55444 ఎకరాల ఆయకట్టు ఉందని, 35 కాలువల ద్వారా ఆ ఆయకట్టుకు నీటిని అందించనున్నట్లు తెలిపారు. నీటి సక్రమ పారుదలకు వారా-బందీ పద్ధతి పాటించాలన్నారు. వారా-బందీ పద్ధతిలో సాగునీటిని సక్రమంగా పంపించేందుకు రెవెన్యూ, పోలీస్, నీటి పారుదల శాఖ సిబ్బందితో తనిఖీ బృందాలు ఏర్పాటు చేయాలని సూచించారు. నీటి చౌర్యం జరగకుండా తనిఖీ బృందాలు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఆయకట్టు చివరి భూముల వరకు సాగునీటిని సక్రమంగా అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్టు ఎస్ఈ కేవీఎన్ స్వర్ణకుమార్, నీటిపారుదల, పోలీస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఒప్పంద కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి

ఒప్పంద కార్మికులకు ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనం అమలు చేయాలని కలెక్టర్, జిల్లాస్థాయి కనీస వేతన కమిటీ చైర్మన్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి కనీస వేతన కమిటీ సమావేశంలో జూలై 2025 నుంచి జూన్ 2026 వరకు చెల్లించవలసిన కనీస వేతనాన్ని సమావేశంలో నిర్ణయించారు. గ్రామీణ ప్రాంతాలలో అన్ స్కిల్డ్ కార్మికులకు కనీస వేతనం రూ.510 నుంచి స్కిల్డ్ లేబర్‌కు రూ.526 వరకు, పట్టణ ప్రాంతాలలో అన్ స్కిల్డ్ కార్మికులకు కనీస వేతనం రూ.910 నుంచి స్కిల్డ్ లేబర్‌కు రూ.950 వరకు చెల్లించేందుకు కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. నిర్ణయించిన ధరల ప్రకారం ఒప్పంద కార్మికులకు వేతనాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కార్మిక శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో కమిటీ సభ్యులు రోడ్డు భవనాల శాఖ ఎస్ఈ కాంతిమతి, సీపీఓ పి.బాలాజీ, కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎస్‌డీవీ ప్రసాదరావు పాల్గొన్నారు.